# 'పిల్లలున్నారు జాగ్రత్త'

మురళీకృష్ణ చూస్తున్నాడు.

రెండో చెల్లెలుకు జడల్లుతోంది రాజేశ్వరి. కిటికీ లోనించి లోపలకు వస్తున్న ఎండ వాళ్ళిద్దరి మీదా పడుతోంది. చెల్లెలు ఎండను చూళ్ళేక కళ్ళను ఓరగా మూసుకున్నది.

నిలబడి ఉన్నారిద్దరూ....

వాళ్ళ కెదురుగా ఉన్న బల్లమీద కూర్చుని చూస్తున్నాడు మురళీకృష్ణ.

"కదలకుండా నిలబడలేవూ?" విసుక్కుంది రాజేశ్వరి.

చెల్లెలు కళ్ళు తెరవటానికి ప్రయత్నించి మళ్ళీ మూసుకున్నది.

"ఆ కిటికీ తలుపులు మూసెయ్యి" మురళీకృష్ణకు చెప్పింది రాజేశ్వరి.

చూస్తున్న అతను నిలబడి కిటికీ తలుపులను మూశాడు. మళ్ళీ కూర్చున్నాడు అక్కడే.

మళ్ళీ చూపులు మొదలుపెట్టాడు.

అతడి చూపులు రాజేశ్వరి గుండెలమీద ఉన్నాయి. రాజేశ్వరి పమిట జారిపోయి ఉంది. ఆమెకు తెలుసు ఆ విషయం. అయినా ఎందుకో సరిచేసుకోలేదు. ఆమెకి జారిపోయిన పమిటను సరిచేసుకోవాలంటే ఏమిటో నిర్లక్ష్యం. ఇంతలోనే ఏమవుతుంది? ఇంట్లోనే కదా? ఎవరున్నారు? అంతా తమవాళ్ళే.... చెల్లెళ్ళూ....

కాని.... ఆమె భావన అలా ఉంటే మురళీకృష్ణ ఆలోచనలు ఇలాగ ఉన్నాయి.

....రాజేశ్వరి ఏమిటి? పమిట జారిపోయినా ఎందుకు సరిచేసుకోదు? తెలీదా? ఎందుకు తెలీదూ? ఇప్పటికి ఎన్నోసార్లు తల వంచి చూసుకున్నది. మరయితే ఎందుకు ఊరుకున్నట్టు? ఎదురుగ్గా తను చూస్తున్నట్టు తెలీదా? అయినా ఇలాగ ఉందంటే తను చూట్టం ఆమె కిష్టమేనా?

ఇంతకీ మురళీకృష్ణకు పద్నాలుగేళ్ళు దాటలేదు. కొంచెం సన్నగా, పొడుగ్గా ఉంటాడు. రాజేశ్వరి వాళ్ళంటే ఎదురింట్లోకి ఏడాది క్రితం అద్దెకు దిగారు. అప్పట్నించీ వీళ్ళింటికి వస్తూనే ఉన్నాడు.

అప్పుడే యవ్వనంలోకి అడుగుపెట్టబోతున్న అతనికి రాజేశ్వరిని చూస్తే

అదోలా ఉంటుంది. చెప్పలేని పరవశం కలుగుతుంది. రాజేశ్వరికి ఇరవైయేళ్ళ లోపు ఉంటాయి. బంతిపువ్వులా ఉంటుంది. పుష్టిగా, ఆరోగ్యంగా రబ్బరుబొమ్మలా ఉంటుంది. ఇంటర్ వరకు చదివింది. ఇంకా చదువాలనే అనుకుంది కాని పెళ్ళి ప్రయత్నాలు ఆమె చదువును ముందుకు సాగనివ్వలేదు.

రాజేశ్వరికిద్దరు చెల్లెళ్ళు.

"రిబ్బన్లు ఇలా ఇవ్వు" అన్నది రాజేశ్వరి.

ఇచ్చింది చెల్లెలు.

రిబ్బన్లు ముడిపెడుతూ "ఏం మురళీ" స్కూలు టైము కాలేదా?" అనడిగింది.

ఉలిక్కిపడి వెంటనే "స్కూల్లేదు. రెండో శనివారం" అన్నాడు.

ఇంకో రెండు నిమిషాలకు రాజేశ్వరి అక్కడి నించి వెళ్ళిపోయింది.

అయినా అతను బల్లమీద నుంచి కదల్లేదు.

అప్పటి వరకూ తను చూసినదంతా తిరిగి కనులముందు చిత్రించుకుంటూ కూర్చున్నాడు. ఇంకా చూస్తున్నట్టుగానే ఫీలవుతున్నాడు.

మురళీకృష్ణకు అదో గొప్ప అలవాటు.

రోజూ ఉదయం ఆ వేళకు అతను వాళ్ళింటికి తప్పకుండా వస్తాడు. రాజేశ్వరి చెల్లెళ్ళకు జడల్లుతూ ఉంటుంది. అప్పుడు కదలికల్లో ఆమె పమిట జారిపోతుంది. అతను చూస్తూ కూర్చుంటాడు. అంతులేని పరవశాన్ని పొందుతాడు. గొప్ప ఆనందానికి లోనవుతాడు.

రోజూ ఆ దృశ్యాన్ని చూస్తున్నా ఇంకా చూడాలనే అనిపిస్తోంది. అతనా విషయాన్ని బాగా తెలుసుకున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త అనుభూతి కలుగుతూనే ఉంది.

ఎంత అందమైనది ఈ రాజేశ్వరి?!

మురళీకృష్ణ ఆలోచనలు ముందుకీ.... అప్పుడప్పుడు జరిగిన సంఘటనల మీదికి.... వెనక్కీ పరుగులు దీస్తున్నాయి.

కొన్ని రోజుల క్రితం....

సాయంత్రం స్కూలు నించి రాగానే అతను రాజేశ్వరి ఇంటికి వచ్చాడు. చాపమీద కూర్చుని మల్లెపూలు మాల కడుతోంది ఆమె. అతను ఆమెకి కొంచెం దగ్గరగా కూర్చున్నాడు.

ఉన్నట్టుండీ "మల్లెపూలు బావున్నాయి కదూ?" అన్నది రాజేశ్వరి.

అతను మాట్లాడలేదు.

"నీ మొహం నీకేం తెలుస్తుంది? విచ్చుకోటానికి సిద్ధంగా ఉన్న పూలయితే బావుంటాయి. ఈ మొగ్గలు చూడు ఎంత బాగున్నాయో" అని ఓ నాలుగు మొగ్గలు అతడికి అందించింది.

అప్పుడతనికి ఆమె చెయ్యి బాగానే తగిలింది. ఏదో తెలియని కలవరం కలిగింది.

"మేం సినిమాకు వెళుతున్నాం. నువ్వు కూడా వస్తావా?" అనడిగింది రాజేశ్వరి.

"మా అమ్మను అడగాలి"

"వెళ్ళి అడుగు. త్వరగా రావాలి టైమవుతోంది"

అయిష్టంగానే చూపులను మరల్చుకుని ఇంటికి వెళ్ళాడు. వాళ్ళమ్మ పర్మిషన్ ఇచ్చింది. స్నానం చేసి వచ్చేశాడు వేగంగా....

వాళ్ళంతా రెడీగా ఉన్నారు.

సిటీ బస్సులో సినిమాకు బయల్దేరారు.

అందరికంటే చివరిగా ఎక్కిన రాజేశ్వరి అతడి వెనుకే నిల్చుంది.

వెళుతున్నది బస్సు వేగంగా.... లోపలి మనుషులు ముందుకీ.... వెనక్కీ ఊగుతున్నారు. అలల మీద తేలుతున్నట్టు. అలా ఆ విధంగా.... ఊగుతున్నప్పుడల్లా రాజేశ్వరి గుండెలు అతనికి మెత్తగా తగులుతున్నాయి. అతడికి అలా ఎంత దూరమయినా ఎన్ని వందల మైళ్ళయినా బస్సు ఆగకుండా పోతూ ఉంటే బావుండుననిపించింది.

కాని.... అతడి ఆలోచనలకు వ్యతిరేకంగా బస్సాగింది.

యాంత్రికంగా దిగాడు.

కానీ ఒక్కటే ఆలోచన. రాజేశ్వరి కేమీ ఈ విషయం తెలీదా? అతనకి ఉ న్న స్పర్శ ఆమెకి ఉండదా?

ఆలోచిస్తూనే ఉన్నాడు మురళీకృష్ణ.

ఎక్కడా? అతని ఆలోచన్లు తెగడంలేదు.

రాజేశ్వరి ఎందుకిలా ప్రవర్తిస్తోంది? తనని చిన్నవాడిగా అనుకుంటున్నదా? మరో ఏడాదికి తనకి పదిహేనేళ్ళు ఉంటాయి. నీ వయసుకి ఎలాంటి ఆలోచనలు కలిగేది.... ఎలాంటి ఊహలు వచ్చేదీ రాజేశ్వరికి తెలీదా?

అప్పటికీ తల్లి కూతుర్ని మందలిస్తూనే ఉన్నది.

"ఏమిటా నిర్లక్ష్యం? అలా ఊరుకుంటావేం? ఇంకా చిన్నదానివేనా?" అని ఎన్నిసార్లో అన్నదామె.

అయినా రాజేశ్వరి తల్లి మాటలను అంతగా వినిపించుకోలేదు.

"ఎందుకు?"

తనంటే.... తనలా చూడటం ఆమె కిష్టమా?

ఇలాగ ఆలోచనల్లో.... మునిగిపోతున్నాడు మురళీకృష్ణ.

"నువ్వింకా ఇక్కడే ఉన్నావా?" ఆ గదిలోకి వచ్చిన రాజేశ్వరి అన్నది.

గిడుక్కున చూశాడు మురళీకృష్ణ.

స్నానం చేసొచ్చింది రాజేశ్వరి. లంగా, జాకెట్టు వేసికొన్నది రెండూ తడిగా ఉన్నాయి. ఓణీని టవల్లా భుజాన వేసుకొన్నది.

బావుండదని.... అక్కడి నించి వెళ్ళాలనుకున్నాడతను.

ఎప్పుడు?

రాజేశ్వరి వెళ్ళమంటే....

కాని ఇహ రాజేశ్వరి అతణ్ణి పట్టించుకోలేదు.

ఆ గదిలో రెండు కళ్ళు తననే దీక్షగా చూస్తున్న స్పృహ ఆమెకి కొంచెం కూడా లేదు.

అందుకే రాజేశ్వరి స్టాండు మీది ఓణీని అందుకున్నది.

చూస్తున్నాడు.

టవల్లా వేసుకున్న ఓణీని తీసేసింది.

అతడి కళ్ళు కొత్త కాంతితో మెరిశాయి. గుండె వేగంగా కొట్టుకుంది. శరీరంలోని వెత్తురంతా మొహంలోకి వచ్చినట్లనిపించింది.

ఓణీ మార్చుకుంటోన్నది.

ఇక....కూర్చోలేకపోయాడు మురళీకృష్ణ. రివ్వున గాలికంటే విసురుగా

వెళ్ళి రాజేశ్వరిని గట్టిగా కౌగిలించుకున్నాడు.... ఆవేశంగా.

హడలిపోయింది రాజేశ్వరి. భయంతో కేక పెట్టాలనుకుంది కానీ.... నోరు పెగల్లేదు. అసలేం జరిగిందో ఒక్క క్షణం వరకూ తెలీలేదు.

షాక్!

ఒకే ఒక్క క్షణం.

మరుక్షణంలో అతణ్ణి పురుగులా విదిలించింది.

తన గుండెంకేసి మొహాన్ని గట్టిగా అదుముకుంటున్న మురళీకృష్ణను వెనక్కు నెట్టేసింది బలంగా.... అతను గోడమీద పడ్డాడు.

పడుతూనే తిరిగి నిల్చున్నాడు.

అప్పుడు రాజేశ్వరి మొహం అగ్నికీలల్లో దహించుకుపోతున్నట్టుగానే ఉంది. ఓణీని వంటికి చుట్టుకుని....

"ఛీ.... నువ్వింత నీచుడివనుకోలేదు. నీలో ఇంతటి హీనమైన ఊహలు ఉన్నాయని కల్లో కూడా ఊహించలేదు. చిన్నవాడివనీ.... నా చెల్లెళ్ళతోటివాడివనే అనుకున్నాను. నిన్ను చూస్తుంటే అసహ్యంగా ఉంది. వెళ్ళిపో. ఇంకెప్పుడూ ఈ ఇంటివైపు చూడకు" అదురుతున్న గుండెలతో.... ఎర్రబడిన కళ్ళతో గుమ్మంవైపు వేలితో చూపుతూ అన్నది రాజేశ్వరి.

అతను మాట్లాడలేదు. మౌనంగా గుమ్మం దగ్గరకు వెళ్ళాడు. వెళుతూనే మళ్ళీ ఆగిపోయాడు.

"వెళ్ళవేం?"

"వెళతాను. నీ కళ్ళకు నేను చిన్నవాడిగానే కనపడొచ్చు. అయినా చిన్నవాళ్ళకి ఉండే ఆలోచనల్లు నీకు తెలీకపోవచ్చు. ఇంకెప్పుడూ చిన్నపిల్లలే అని పమిట జారితే నిర్లక్ష్యంగా ఉండకు, నాలాంటి పిల్లలుంటారు జాగ్రత్త" అని తర్వాతనే నెమ్మదిగా వెళ్ళిపోయాడు మురళీకృష్ణ.

తుఫాన్లో సముద్రతీరాన కొబ్బరిచెట్టులా వణికిపోయింది రాజేశ్వరి. ❖

*పల్లకి వారపత్రిక, 22-9-1993*